(తరుణ; మాసపత్రిక; ఆగష్టు 1973)

ఉత్తరకుమార ప్రజ్ఞ

"అక్కరకు రాని చట్టము" అదీ, ఆ వ్యాసం పేరు. రచయిత, డాక్టరాఫ్ లెటర్స్.

'అక్కరకు రాని చుట్టము' అనుండాలి కాబోలని కొమ్ము పెడదామని కలం తీసేను. కాని వార పత్రికాఫీసులో ఇలాటి (ప్రూఫ్) రీడర్లుంటారని ముందే తెలిసిన వాడిలా, ఆ ఒక్క అక్షరం మిగతా వాటికన్నా కాస్త పెద్దదిగా, రెండు మూడుసార్లు దిద్ది వ్రాసేను. కనక, దిద్దేముందు కొంచెం ఆగి, వ్యాసం చదివేను.

కుటుంబ నియంత్రణ!

ఆ విషయంపై మా పత్రిక ఇంతవరకు నిశ్శబ్దంగా వుంటూ వచ్చింది. ఎడ్వర్టైజుమెంట్లు తప్ప మరోటి ఏదీ బుద్ధి పూర్వకంగా వెయ్యడం లేదు; పరధ్యానంగానూ లేదు!

స్త్రీలశీర్షిక ద్వారా ఈ సబ్జక్టు మా పత్రికలో చొరబడి పోదామని చేసిన ప్రయత్నం ఇంతా అంతాకాదు. స్త్రీలు రాసే వ్యాసాల్లో (వాళ్ళు దేన్ని గురించి రాసినాసరే) తెలియకుండా ఈ సబ్జక్టు మీద ఒకటి రెండు వాక్యాలు దొర్లడం నేను తరుచుగా గమనిస్తూవుంటాను.

మాట వరసకి. ఒకావిడ కాశ్మీరో కైలాసమో విహారయాత్రకి వెళ్ళిందనుకోండి, వాళ్ళాయనగారు కష్టపడి తీసిన ఫొటోల్తో సహా ఆ అనుభవాలు వ్యాసంగా రాసి పంపిస్తూ, "మాకిద్దరేగా పిల్లలు! అది చూసి అక్కడి వాళ్ళెంతో ముచ్చట పడ్డారు. చిన్న కుటుంబానికి మించిన సుఖం ఏముంది, జీవితంలో? తృప్తిని మించిన ఆదర్శం లేదని మన భారతీయ సంస్కృతి ప్రబోధిస్తూ వుంటుంది. గాని ఇద్దరు పిల్లల్తో తృప్తిచెందడం మన వెనకటి తరాల వాళ్ళకి ఎందుకు అలవాటవలేదో?"— ఇలా రాసుకుంటూ పోతారు. పూబోణికి ఈ బాణి నేర్పిన వాణిని మౌనంగా స్మరించుకుంటూ ఆ వాక్యాలను ఎర్రపెన్సిలుకి ఆహుతి చేస్తూ వుండడం నాకు మామూలు.

కాని, ఈ విషయంమీద ఈ డాక్టర్ రాఫ్ పెటర్స్‌గారు సరాసరి వ్యాసం రాసి పంపేరు. అది ఎందుకో నన్ను బాగా ఆకర్షించింది. అలవాటుగా ప్రక్కన పెట్టేసిందాన్నే మళ్ళా తీసి చదివాను,

కేరళ రాష్ట్రంలో నట—

వివాహానికి కనీసవయోపరిమితిని నిర్ణయిస్తూ ప్రభుత్వం వొక చట్టం చెయ్యాలని సంకల్పించిందట. అది, దాదాపు పది పన్నెండు రోజుల క్రితం అన్ని ప్రముఖ దిన పత్రికలలోను వచ్చిన ఒక వార్త,

వధువుకు ఇరవై ఒకటి, వరునికి ఇరవై ఏడు సంవత్సరాలు కనీసం వుంటేగాని పెళ్ళిళ్ళు జరగటానికి వీల్లేదని చట్టం తేవాలని ఆ ప్రయత్నం.

అలా చట్టం తెచ్చిన తరువాత, పదహారేళ్ళ ఆడపిల్ల తల్లి కావడానికీ, ఇరవై ఏళ్ళ బాలుడు తండ్రి అయిపోడానికీ ఇప్పట్లా అవకాశం వుండదని, అందువల్ల ఏ మనిషి పుట్టుకు ఆ మనిషికి సంతానోత్పత్తి అవకాశం చాలా తక్కువయిపోతుందని, జనాభా సమస్యను ఈలోగా వధూవరులు పరిపూర్ణంగా ఆకళింపు చేసుకోగలరు గనుక "కళ్ళు మూసితెరిచేలోగా తల్లిదండ్రులు అయిపోవడ"మనే సాంఘిక దురాచారం నశిస్తుందని; ఈ ముఖ్యమైన వుపయోగం వల్ల ఈ చట్టం బహుళ జనాదరణ పొందే అవకాశంవుందని, ఆ చట్టం వెనుక కలగిన చెలగిన ఆలోచన. అదికూడా ఆ న్యూస్ ఐటమ్‌లో సూచన ప్రాయంగా ఎవరో ఉద్ఘాటించారని ప్రచురింప బడింది.

"డాక్టరాఫ్ పెటర్స్" గారు ఈ వ్యాసంలో, ఆ చట్టము "అక్కరకురాని చట్టము" అని అభివర్ణించారు:-

"దేశమంటే మనుషులోయ్" అన్న మహాకవి వాక్యంతో నేనేకీభవిస్తాను. కాని, దేశం సమస్య మనుష్యులది కాదు మనుష్యుల సమస్యే దేశానిది అని గమనించ ప్రార్థన" అని రచయిత ప్రారంభించేరు ఆ వ్యాసాన్ని....

ఈ దేశంలోని మనుష్యులకు ఒకరకం జీవనం ధర్మప్రాయమైనప్పుడు ఆ ధర్మ పరిరక్షణార్థం, జాతి, దానికి తగిన పథకాలు రూపొందించుకోవాలే తప్ప; కృత్రిమమైన పద్ధతులతో అవినీతికరమైన పథకాలు అమలుచేసి, ప్రజలు శతాబ్దాల తరబడి అనుష్ఠిస్తున్న ధర్మానికి ఘావుదెబ్బతీస్తూ కొత్త సమస్యల్ని వుత్పన్నం చేయరాదని ఆయన ఖండించారు.

భౌతిక, భౌగోళిక పరిస్థితుల వలన, ఈ దేశస్థులకి శారీరక, మానసిక అవసరాలు. ఇవీ అని లక్షల కొద్ది ఏళ్ళక్రితం నిశ్చయమైనాయి. పదకొండు-పద్నాలుగేళ్ళ మధ్య ఆడబిడ్డ రజస్వల కావడం ఇక్కడి శీతోష్ణస్థితి నిర్ణయం. వివాహానికి కనీస వయోపరిమితిగా ప్రభుత్వం నిర్ణయించబోతున్న ఇరవ య్యొకటనే వయసు వచ్చేవేళకు, ఆడపిల్ల స్త్రీ అయిపోయి ఎనిమిది నుంచి పదేళ్ళ వరకు అవవచ్చు. శారీరక అవసరాల్ని పదేళ్ళు మరుగుపెట్టి మనస్సును అదుపులో పెట్టుకోడం అనేది ఎంతకష్టమో, అనుభవించే వోపిక లేకపోతే వూహించి చూడొచ్చు. చట్టరీత్యా వివాహం సాంసారిక జీవితం వీల్లేని పెద్ద వయసు వాళ్ళు, ఆ చట్టం రాకముందు వివాహితులైపోయి సాంసారిక జీవితాన్ని నడుపుతున్న చిన్నవాళ్ళని చూడ గలుగుతారు. మనసు కట్టుకోలేని వారు మార్గం తప్పి అధర్మ వర్తనులైతే జాతి పురోగమనం వ్యక్తి జీవనాన్ని అభివృద్ధిలోకి తేలేకపోగా, వ్యక్తిజీవితం ద్వారా జాతి పురోగమనానికి, సంస్కృతికి, ధర్మానికి ముప్పు సంభవించడం అనివార్యం. కనుక, మీ చట్టం వివాహాన్ని నిషేధించిన చేతుల్తోటే వివాహపూర్వ వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తుంది; ఇప్పటికే పాశ్చాత్య ప్రభావం వల్ల దిగజారిపోతున్న నైతిక విలువల్ని ఇంకా అథః పతితం చేయబూనడం శోచనీయం, నీచం.

* * *

"అక్కరకురాని చట్టము" మా వార పత్రికలో ప్రచురించాను. పత్రిక వెలువడి ఐదురోజులైంది. మరుసటివారం పత్రిక దాదాపు అంతా అచ్చు అయిపోయింది. ఉత్తరాలపేజి, సంపాదకీయం ఇలాంటివేవో ఉన్నాయి. ఉత్తరాలన్నీ వాకచోట పోగుచేసి. మంచీచెడూ ఎంచుకుంటూ ,ఎర్రపెనిసిలు తీసుకుని ఉత్తరాల పొడవును తగ్గించుకొంటూ వున్నాను.

"ఇవాల్టి ఉత్తరాలు సార్" అని ఆఫీసుబోయ్ ఒక చిన్నకట్ట ఇచ్చాడు.

"ఇదేదో కథలా వుంది" అనుకుంటూ అందులోంచి ఒక కాగితాల మడత తీశాను.

కథకాదు, ఉత్తరమే.

ఐదు పేజీలుంది-

"""అక్కరపురాని చట్టము మీ పత్రికలో ప్రచురించేరు. ఇది చాలా తొందరపాటుతో కూడిన చర్య" అని మొదలైనది, ఆ ఉత్తరం-

డాక్టరావ్ లెటర్స్‌గారు ఇచ్చిన వాదం అంతా అభివృద్ధి నిరోధకంగా వుందని ఆ ఉత్తరంలో ఆరోపించ బడింది.

మానవజాతి మీద ప్రకృతి, ప్రకృతి మీద మానవజాతి, తమతను ఆధిక్యతలను నిరూపించుకోడానికి నిరంతరం జరిగే సంఘర్షణే లక్షలాది సంవత్సరాల నుంచి ఈ భూగ్రహంలో కరుగుతున్న ప్రపంచ వ్యాపారం. ఎప్పటికప్పుడు మానవజాతి ప్రకృతిమీద చిన్నచిన్న విజయాలు సాధిస్తూవచ్చినా,అవి ప్రకృతిలో రహస్యాలు కనుక్కోడం క్రిందికే వస్తాయి, అంతిమ విజయం ప్రకృతిదే. ఎందుకంటే మానవజాతి తాము పెరిగినంతగా ప్రకృతిలో ఆహార వసతులు పెంచలేక పోవడమే. ఈ విషయం అందరు శాస్త్రజ్ఞులు అంగీకరించిందే. ఎప్పటికైనా తిండిలేక మలమల మాడిపోయే ఆపద మానవజాతికి రానున్నది. ఆ దుష్ట దినాన్ని వాయిదా వెయ్యడమే కుటుంబనియంత్రణ పథకాల ఉద్దేశం.

కనుక. కుటుంబనియంత్రణ ఏదో ఒక దేశానికి చెందిన సమస్యఅని గాని ఒక జాతి సంస్కృతికి పరిమితమైన సవాలు అనిగాని అనుకోవడం కేవలం మూర్ఖత్వం.

—ఈ విధంగా సాగింది, ఆ ఉత్తరం

రచయిత-

కాదు రచయిత్రి - శ్రీమతి- ఆర్. శకుంతలా రాణి... బి.ఎ.

అటూ ఇటూ తిప్పి ఎడ్రసు వుందేమోనని చూశాను.... ఉన్నది. కేరాఫ్. కుటుంబ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టరు గారి ఆఫీసులో అప్పర్ డివిజన్ గుమాస్తా... హంసవాడ.

ఉత్తరం చివరంటా చదివాను. ఆవిడ ఆర్గుమెంటు చాలా సాధికారికంగా వుంది. రచనకూడా, కొంచెం గడ్డుగా వున్నప్పటికీ పదునుగానే వుంది.

ఇంతవరకు వచ్చిన ఉత్తరాల్లో ఒకటి రెండు. మాపత్రికను కుటుంబ నియంత్రణా వ్యతిరేక పత్రికగా వుదహరించాయి. పాఠకుల అభిప్రాయాలకి, రచయితల రచనలకి సంపాదక వర్గం ఏకీభావం గాని బాధ్యతగాని లేకపోవచ్చునని, ఎక్కువమంది అనుకోకపోవచ్చు. ప్రభుత్వమే అలా అనుకోకపోవచ్చును.

ఎలాగా ముగ్గులోకి దిగాం కదా, కుటుంబనియంత్రణా వ్యతిరేకత మాత్రమే ఎందుకు?

అని—ఇలా ఆలోచించి. శకుంతలా రాణీగారి ఉత్తరం అచ్చు వేశాను.

* * *

ఆరు వారాలయింది.

అక్కరకురాని చట్టము వ్యాసం మీద అటూ ఇటూ ఉత్తరాలు చాలా ఎక్కువగా వస్తున్నాయి, వెనకెప్పుడో ఒక ప్రముఖ రచయిత్రి రాసిన ఉద్వేగ పూరితమైన నవల సీరియల్‌గా వేస్తున్నప్పటి కంటెకూడా ఎక్కువగా వస్తున్నాయి.

ఆ ఉత్తరాలు సామాన్య పాఠకులూ రాస్తున్నారు. డాక్టర్లు, లాయర్లు, ఫిలాసఫీ: సోషియాలజీ చెప్పే లెక్చరర్లు కూడా రాస్తున్నారు. వారందరితో బాటు "డాక్టరాఫ్ లెటర్స్" గారు, శకుంతలారాణి గారు కూడా రాస్తున్నారు. అందరితోబాటు రాసినా, డాక్టరాఫ్ లెటర్స్‌గారూ శకుంతలారాణిగారు మాత్రం సరికొత్త ఆర్గుమెంట్స్‌తో. పరిమిత కుటుంబాల వుదాహరణల వుదంతాలతో వ్రాస్తూ, ఇవి ఉత్త ఉత్తరాలుకావు పంచవర్ష ప్రణాళికలు అనిపించేస్తున్నారు. చాలా ఇంటలిజెంట్‌గా, ఇంటరెస్టింగ్‌గా వుంటున్నాయి. అవన్నీ.

ఈ వారం డాక్టరాఫ్ లెటర్స్‌గారి వాదానికి సంబంధించినవి వేస్తే, మరు చటి వారం శకుంతలారాణిగారి వాదానికి సంబంధించినవి వేస్తూ, ఆ కలన్ అలా నిలుపుకొంటూ వస్తున్నాను.

"బిజీగా వున్నారా?" అంటూ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. మా బిజి నెస్ మేనేజర్ రావుగారు.

"అబ్బే లేదండీ" అన్నాను, చిరునవ్వు తెచ్చుకొని "వారపత్రిక రేపు విడుదలకదా;" అన్నాను; ఒకవేళ బిజీగా వున్నా, నాతప్పులేదని తెలియబరుస్తూ.

"అది కాదూ, ఉత్తరాల శీర్షికలో ప్రచురిస్తున్న వాటికి పారిషికంతో యిస్తున్నామా, మనం?" అని సూటిగా అడిగారు రావుగారు.

"అన్నిటికీ ఇవ్వడం లేదు–"

"అదే, నేను అడగాలనొచ్చాను. అన్నిటికీ ఇవ్వనప్పుడు-?" సిగరెట్ దమ్ములాగుతూ ప్రశ్న వెయ్యకుండా తప్పించుకున్నారు బిజినెస్ మేనేజరు గారు.

డొంకతిరుగుడు అనవసరం.

"-కుటుంబ నియంత్రణ గురించి వాద ప్రతివాదాలు జరుగుతున్నాయి. మన పత్రికలో అవి స్వీకరించాం. వాటిల్లో మౌలికంగా, నిర్మాణాత్మకంగా వున్నవాటికి పారితోషికం ఇవ్వాలని (అదీ చాలా స్వల్పం) నేను నిర్ణయించేను. నిజానికి అవి ఉత్తరాలుకావు అవన్నీ వ్యాసాలు. కాని విడిగా వ్యాసాల్లాగా వాట్ని స్వీకరించి ప్రచురిస్తే కొన్ని ఇబ్బందులున్నాయని నేను వాటికి పాఠకుల పేజీ ఇచ్చాను. రచనకి మనం యిచ్చిన ప్రాధాన్యాన్ని బట్టికాక, రచనలో సరుకును బట్టి పారితోషికం యివ్వడం ఆరోగ్యం కదా." అన్నాను "ఐ ఎగ్రీ" అన్నారు మేనేజర్‌గారు; అలవోకగా, నా చేతిలో కాగితం అందుకుంటూ; ఈ వారం పత్రికలోకి అచ్చుకిస్తున్న శకుంతలారాణీగారి ఉత్తరం అది. క్రింద. "ఈ చర్చ ఇంతటితో ఆఖరు" అని ఒక రిమార్కు అప్పుడే రాశాను, నేను.

"అరెరె! "అని లేచారు రావుగారు "ఇదేమిటి, ఈ అన్యాయం!?" అని కంగారు పడ్డారు.

"అన్యాయం ఏముంది? ఎనిమిది వారాలై జరుగుతోంది, ఇంకా ఎందుకు?"

"మీకు బోర్‌గా వుందా?"

"నాకు లేక పోవచ్చు, కాని పాఠకులకి బోర్‌గా ఉండొచ్చు కదా."

"పాఠకులకి బోర్‌గా లేకపోతే?" అని పెంకెనవ్వు నవ్వారు రావుగారు.

"లేదని ఎలా?"

"లేదు బాబూ, లేదు! ఎనిమిది వారాల కిందట కదూ, మీరీ ఫోరమ్ ఓపెన్ చేసేరు! సేల్సు గ్రాఫ్ చూడండి-అలా అలా పైకి వెళ్ళిపోతోంది. ఈ వ్యాసాలు వెయ్యకముందు మన వారపత్రిక వారానికి ఇరవై ఎనిమిదివేలు అమ్మాం. ఇప్పుడు ముప్పయ్యారువేలు - సర్క్యులేషన్ ఎలా పెరుగుతోందా అని పేజీలు తిరగేసి చూశాను, నాలుగో వారంనుంచే. కొత్త సీరియల్స్ లేవు. సినిమాలు కథలు, వ్యాసాలూ అన్నీ మామూలే. కనక ఈ ఉత్తరాలతోనే

సర్క్యులేషన్ పెరిగిందని నేను మీకు మనవి చేస్తున్నాను-" అన్నారు మేనేజర్‌గారు.

నేను ఆశ్చర్యపడ్డాను. జనంలో ప్రభుత్వ ప్రచారాల ద్వారా, ఆకాశవాణి ద్వారా, బస్సుల వెనకా రైళ్ళలోను, అక్కడా ఇక్కడా విశ్వరూపం దాల్చిన ఈ సబ్జక్టు, సర్క్యులేషన్ పెంచేటంత సజీవమైనదా!....దానికి కారణం ఆ ఉత్తరాలలోని శక్తి తప్ప, విషయంలో బలం కాదు!

"కనక, వాళ్ళకి పదో పదిహేనో రూపాయలు పంపడానికి మీకు ఇబ్బందేం వుండ కూడదు." అన్నాను మేనేజరు గారి కళ్ళలోకి నవ్వుతూచూస్తూ.

బిజినెస్ మేనేజరు రావుగారు నమస్కారం చేసి, "మీరే గెల్చారు గాని- ఈ వాక్యం కొట్టేయండి మరి!" అన్నారు.

* * *

పన్నెండువారాలు సాగిన ఆ చర్చ డాక్టరాఫ్ లెటర్స్ గార్నుంచి ఉత్తరం లేక పోవడంవల్ల, చివరికి ఆగిపోయింది.

మరో పదిహేను రోజులు గడిచాయి. ఒకనాడు విజయవాడ నుంచి పుస్తక ప్రచురణ కర్త ఒకాయన వచ్చి, కుటుంబ నియంత్రణ- సంగతి సందర్భం" అని చేత్తో టైటిల్ రాసిన ఒక అచ్చు పుస్తకం పట్టుకొచ్చి నా చేతిలో పెట్టాడు" ఈ పుస్తకంలో, మీ పత్రికలో వచ్చిన వాదోపవాదాలన్నీ వరసగా అచ్చువేశాం, రేపు ఇరవైనాలుగో తేదీని ఈవూళ్ళో ఈ పుస్తకం ఆవిష్కరణ మహోత్సవం ఉన్నది! డాక్టరాఫ్ లెటర్స్‌గారూ, శకుంతలా రాణి గారూ కూడా. అవిష్కరణ మహోత్సవంనాడు మీరు వచ్చి మాట్లాడితే బావుంటుందని అంటున్నారు. మీరు అంగీకరించాలి" అన్నాడు, ఆ ప్రచురణకర్త.

"ఆవిష్కరణ ఎవరిచేత చేయిస్తున్నారు?"

"ఇరవైనాలుగో తేదీని ఈ వూరికి ఆంధ్రప్రదేశ కుటుంబనియంత్రణ శాఖ డైరెక్టర్‌గారు వస్తున్నారు- వారు ఆవిష్కరిస్తారు. జిల్లా అధికారులు వస్తారు, ఈ సభకి."

నేను సరేనన్నాను.

* * *

"ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడానికి నాకు చాలా గర్వంగా వుంది"

అన్నారు, కుటుంబనియంత్రణ శాఖ డైరెక్టర్‌గారు. ఎర్ర రిబ్బన్‌తో కట్టిన పుస్తకం చేత్తో పుచ్చుకుని మాట్లాడుతూ.

"మొదటి రెండువారాలూ నేనంతగా పట్టించుకోలేదుగాని. క్రమంగా ఈ ఉత్తరాలు నా దృష్టిలో పడ్డాయి. అవన్నీ చాలా గొప్పవి. మన జాతికి అత్యవసరమైనవిన్నూ. మా డిపార్ట్‌మెంట్ చేయవలసిన పని ఈ లేఖలు రాసిన డాక్టర్ రాఫ్ లెటర్స్‌గారు, శ్రీమతి శకుంతలా రాణీగారు చేశారు. అలా చెయ్యడంలో నున్నూ, మామూలు పద్ధతికి భిన్నంగా, అంకెలతో శాస్త్రీయ వివరాలతో బోరు కొట్టకుండా, ఎంతో ఇంటరెస్ట్‌గా కబుర్లూ కథలూ చెబుతూ వ్రాసేరు. ఈ ఉత్తరాలను ఒక గ్రంథంగా రూపొందించాలని సంకల్పం కలిగిన ప్రచురణకర్తలు చాలా సంఘసేవ చేస్తున్నట్టు నేను భావిస్తున్నాను. ఈ గ్రంథాన్ని అన్ని గ్రంథాలయాలకు నేను రికమెండు చేస్తున్నాను. మీకు అత్యంత సంతోషకరమైన మరొకవార్త ఏమిటంటే, ఈ ఉత్తరాలు రాసినందుకు, ఈ ప్రచురణకర్తగారు ఇచ్చే రాయల్టీ కాక, ప్రభుత్వంవారు, ఈ డాక్టరాఫ్ లెటర్స్‌గారికి, శ్రీమతి శకుంతలా రాణీగారికి, చెరి ఐదువందల రూపాయల ఆవార్డ్ కుటుంబనియంత్రణ శాఖ నిధుల్నుంచి ఇవ్వాలని నిశ్చయించాలు. వారిద్దరు వేదికపైకివచ్చి, చెక్కులు స్వీకరించాలని ప్రార్థన!" అని, కుటుంబనియంత్రణ శాఖ డైరెక్టర్‌గారు రిబ్బన్ కోసి, పుస్తకం ఆవిష్కరింప బడిందని ప్రకటించారు.

ఫోటోలు, చప్పట్లు అయ్యాయి.

వేదిక కుటుంబనియంత్రణశాఖ డైరెక్టర్, పుస్తక ప్రచురణకర్త, నేను, జిల్లాకలెక్టరు, —లతో నిండిపోయింది. డాక్టరాఫ్‌లెటర్స్‌గారు, శకుంతలా రాణీగారు, ఆడియన్స్‌లో వుండిపోయి వుంటారు. కార్యక్రమంలో "రచయితల పరిచయం" అనివొక ఐటమ్‌వుంది.

కాని, అనుకోకుండా వచ్చిన ప్రభుత్వ ఆవార్డ్ అందుకోడానికి వారిద్దరూ కూడా వేదిక మీదికి రావలసి వుంది.

మగవాళ్ళ వరసల్లోంచి సన్నగా, పొడుగ్గా, తెల్లటి పైజమా, తెల్లటి చొక్కా వేసుకున్న ముప్పయేళ్ళవ్యక్తి ఒకాయన వేదికమీదికి వచ్చాడు. వేదిక మీద పెద్దలకు నమస్కరించాడు. సభకున్నూ నమస్కారం చేశాడు.

"శ్రీమతి శకుంతలా రాణీగారు వేదికమీదికి రావాలి". అని డైరెక్టర్‌గారు అర్థించేరు.

సభలో ఆడవాళ్ళ వరసల్లో, శకుంతలా రాణి నువ్వా, అంటే నువ్వా, అన్నట్టుగా, ఎరిగున్నవాళ్ళే వొకరినొకరు అనుమానంగా చూసుకోసాగారు.

కాసేపు కంఠాల కలకలం వినిపించినా, గాజుల గలగల ఏమీలేదు,

డాక్టరాఫ్‌లెటర్స్ అనబడే ఆయన గొంతు సవరించుకున్నాడు.

"నాపేరు ఆర్. రంగారావు. నేను హంసవాడలో ఒక ప్రయివేటు స్కూల్లో ఉపాధ్యాయుణ్ణి. నేను రచయితను కాను. కాని చిన్నప్పట్నుంచీ వివిధ పత్రికలకు ఉత్తరాలు వ్రాయడం అలవాటుంది. ఇప్పటికినావి నాలుగువందల ఎనభై రెండు ఉత్తరాలు అచ్చయ్యాయి— మాణిక్యవీణమీద. ఇల్లాలిముచ్చట్ల మీదే కాక, సీరియల్స్, ముఖచిత్రం మొదలైన వాటిమీదకూడా ఉత్తరాలునావి అనేకం అచ్చయ్యాయి. నా సహోధ్యాయులైన ఉపాధ్యాయులు కొందరు నాకు ఉత్తరకుమారుడని 'నిక్‌నేమ్' పెట్టగా అది మా హంసవాడ అంతటా సంశయం లేని గుర్తుగా తయారైంది; అదేనాకు హింస, అదే ప్రశంస!

"కుటుంబనియంత్రణ గురించి నేను బాగా చదివాను కాని ఎన్ని మాట్లు ఉత్తరాలు, వ్యాసాలు రాసినా అవి అచ్చుకాలేదు. నా ఆలోచనలు అశేష పాఠక జనానికి తెలియజెయ్యలేక పోయానే అనే చింత నన్నెంతో బాధపెట్టగా వచ్చిన ఫలితమే ఈ పుస్తకం.

"డాక్టరాఫ్ లెటర్స్ అనేపేరుతోను, ఆర్. శకుంతలారాణి అనే పేరుతోను, ఈ ఉత్తరాలన్ని నేను ఒక్కణ్ణే రాశాను——" అని కాసేపు ఆగాడు, రంగారావు గారు. హాలు చప్పట్లతో మారుమోగింది.

"అదేమిటి?" అని తెల్లబోయి నిలబడి పోయారు, కుటుంబనియంత్రణ శాఖ డైరెక్టరుగారు.

"ఏవమన్యనైరా రెండువేపులా పరిశీలించగలగాలి, అప్పుడే దాని సంగతి సందర్భాలు ప్రజలకి తెలుస్తాయి. కాని. ఈ వేపు వాదన జరిగినప్పుడు వీరికి తల ఊపి, ఆవేపువాదన జరిగినప్పుడు వారికీ తలలూపే సేరకం మనుష్యులే ఎక్కువ మనలో. పైగా, ఏదో వొకవాదాన్ని సమర్థించేవారు రెండోది ఒటి ఖాళీకుండగా తీసి పారేస్తారు, అలాటి ధోరణి నన్నెంతో బాధించగా. రెరడువైపులా నేనేఎందుకు ఆలోచించి వ్రాయకూడదు అన్న

జిజ్ఞాస నాలో కలిగింది. అందుకని, క్రమ శిక్షణలో సాగిన నా ఆలోచనల్ని రెండురకాల వాదాలుగా విడదీసి దీనిమీద అరడజను, దానిమీద అరడజను వ్యాసాలు ముందుగానే సిద్ధంచేసి పెట్టుకుని. ఒకటి అచ్చవగానే మరొకటి చొప్పున వారపత్రికకి పంపించాను. అన్నీ అచ్చువేసినందుకు ఎడిటర్‌గారికి నా ధన్యవాదాలు.

“మారుపేరు పెట్టి రచన చెయ్యడం నేరం అయితే నన్ను శిక్షించండి. కాని ఈ వాదోపవాదాలు, ఈ బహుళ జనాదరణ వట్టి ఉత్తరకుమార ప్రజ్ఞలుకావన్న గర్వం నాకు చాలు” అని ముగించాడు రంగారావుగారు.

“ఎక్స్‌క్యూజ్ మీ” అని నేను లేచాను. “నేనేమీ ఒక యూనివర్శిటీ వైస్ ఛాన్సెలర్‌ని కాను. కేవలం ఒక పత్రికకు ఎడిటర్ని. అయినా, ఈయన పెట్టుకున్నపేరు. డాక్టరాఫ్ లెటర్స్ “ఆ నేది ఈయనకెంతో సముచితంగా వుందని నా ఉద్దేశం.”

జనం మళ్ళీ చప్పట్లు కొట్టారు.

“అదిసరే–మార్చి 31 వచ్చేస్తోందే, ఆర్. శకుంతలారాణి పేర వ్రాసిన ఈ చెక్కు ఈయనకి ఇవ్వాలా వద్దా? అని నిస్సహాయంగా చతికిల బడ్డారు కుటుంబ నియన్త్రణశాఖ డైరెక్టర్‌గారు.

* * *